

సోమవారం ఉప్పల్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, చిత్రంలో అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు, కార్యకర్తలు

# కలిసికట్టుగా శ్రమిద్దాం.. కారునే గెలిపిద్దాం

- సీఎం కేసీఆర్ మాట జవ దాటను
- ఆయనతో తండ్రిలాంటి అనుబంధం నాది
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

ఉప్పల్, నవంబర్ 6 : రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని, ఉప్పల్‌లో బండారి లక్ష్మారెడ్డిని గెలిపిస్తానని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్‌తో తనకు తండ్రీకొడుకుల అనుబంధం ఉందని తెలిపారు. పార్టీని వీడే ప్రసక్తేలేదని, నా జీవితం ఉన్నంతకాలం బీఆర్ఎస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు. హబ్సిగూడలోని ఎమ్మెల్యే నివాసంలోని కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ బీఆర్ఎస్‌పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ... పార్టీతో 23 ఏండ్ల అనుబంధం ఉందన్నారు. తనను కడుపులో పెట్టుకొని ఒక తండ్రిలా కాపాడిన సీఎం కేసీఆర్‌తోనే తన పయనమని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతోనే సంక్షేమ , అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఆదేశాల మేరకు శక్తివంచన లేకుండా పనిచేస్తూ, బీఎల్ఆర్‌ను గెలిపించుకుంటామని వెల్లడించారు. సీఎం కేసీఆర్ మాట దాటనని, ఒక వృక్షంలా ఎదిగిన బీఆర్ఎస్ పార్టీని ఉప్పల్‌లో కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఉప్పల్ అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడి పనిచేశానని, రానున్న రోజుల్లో ఉప్పల్‌కు మహర్దశ వస్తుందన్నారు.

## అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాం

- రావుల శ్రీధర్‌రెడ్డి

బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ బండారి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని ఉప్పల్ అసెంబ్లీ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఉప్పల్‌లో ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో అద్భుతమైన ప్రగతి జరిగిందన్నారు. ఉప్పల్‌లో పలు రంగాల్లో అభివృద్ధి జరిగిందని, ఐటీ, పరిశ్రమలు, తదితర రంగాల్లో ప్రగతి సాధించిందన్నారు. సాధ్యం కాని హామీలను ఇస్తున్న ప్రతిపక్షాలను నమ్మవద్దని తెలిపారు.

## ఓ కుటుంబంలా కలిసి పని చేస్తాం

- బండారి లక్ష్మారెడ్డి

ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డితో పాటు, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో కుటుంబంలా కలిసి పనిచేస్తామని అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కార్యకర్తలను అందరిని కలుపుకొని పోతామన్నారు. గత ఎన్నికల్లో సుభాష్ రెడ్డి గెలుపు కోసం కృషి చేశానని, ఈ ఎన్నికల్లో తనకు సహకరించాలని కోరారు. ప్రజల ఆశీస్సులతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు.

## కొడంగల్‌లో రేవంత్‌కు ఓటమి తప్పదు : రాగిడి లక్ష్మారెడ్డి

రేవంత్‌రెడ్డి చీప్ ట్రిక్స్ ప్లే చేస్తున్నారని, కొడంగల్‌లో ఆయనకు ఓటమి తప్పదని బీఆర్ఎస్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. కాంగ్రెస్ చీకటి ఒప్పందాలను ప్రజలు గుర్తించాలన్నారు. బండారి సేవలను గుర్తించి, ఓటు వేయాలని కోరారు. గ్రేటర్‌లో మంత్రి కేటీఆర్ కృషి గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, జెర్రిపోతుల ప్రభుదాస్, బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్, సాయిజెన్ శేఖర్, బేతి స్వప్నారెడ్డి, పావనీరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, సుధాకర్, శైలేశ్ రెడ్డి, పాల్గొన్నారు.



బొల్లారం రిసాలా బజార్‌లో బోర్డు మాజీ సభ్యుడు లోక్‌నాథ్‌తో కలిసి ప్రచారం చేస్తున్న లాస్య నందిత

## కంటోన్మెంట్ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం

బొల్లారం, నవంబర్ 6 : అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా అన్ని వర్గాల సంక్షేమ కోసం పాడుపడుతున్న బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపించాలని కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్య నందిత అన్నారు. సోమవారం బొల్లారం, రిసాలా బజార్, కలాసీ గూడ, ఆదర్శ నగర్, బస్తీలో బోర్డు మాజీ సభ్యుడు లోక్‌నాథ్, మార్కెట్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డిలతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా లాస్య నందిత మాట్లాడుతూ..సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆశీర్వాదంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన తనను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. గులాబీ జెండాతోనే సబ్బండ వర్ణాలకు న్యాయం జరుగుతుందన్నారు. నియోజవర్గం అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యుడు లోక్‌నాథ్, మార్కెట్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, మాజీ చైర్మన్ ఖదీర్‌వన్, వార్డు అధ్యక్షుడు రవికుమార్, జంగాల మురళీ యాదవ్, పింజర్ల మురళీ యాదవ్, అనిల్ గౌడ్, శివ, సుశీల్, చందర్, ఉదయ్, ఉమేశ్, రవి, వెంకటేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మౌలాలి డివిజన్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

## మౌలిక వసతులకు పెద్దపీట

మల్కాజిగిరి, నవంబర్ 6: బస్తీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, పేదల సంక్షేమానికి కృషి చేస్తామని మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మౌలాలి, గౌతంనగర్, అల్వాల్, మచ్చ బొల్లారం, వెంకటాపురం, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లలో బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ విడుదల చేసిన బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను గెలిచిన తరువాత అమలు చేస్తామన్నారు. మౌలాలిలో మైనారిటీలకు ఫంక్షన్‌హాల్‌ను ఏర్పాటు చేస్తామని, శ్మశానవాటికలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. పేదల సమస్యలను పట్టించుకోని ఎమ్మెల్యేను ఇంటికి సాగనంపాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సునీతరాము యాదవ్, మీనాఉపేందర్ రెడ్డి, సబితాకిశోర్, శాంతిశ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, నాయకులు పరశురాంరెడ్డి, జేఏసీ వెంకన్న, రాముయాదవ్, అమీనుద్దీన్, ఖలీల్ పాల్గొన్నారు.



బోరబండలో ఒకే వాహనంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, విష్ణువర్ధన్ రెడ్డి

## పని చేసే నాయకులకే గుర్తింపు

- డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

సికింద్రాబాద్,నవంబర్ 6: ప్రజల కోసం పని చేసే నాయకులకు మంచి ఆదరణ ఉంటుందని డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని తార్నాకలో ప్రచారం నిర్వహించారు. ముందుగా లాలాపేట సత్యనగర్ నుంచి ప్రచార పాదయాత్ర పార్టీ జెండాను ఆవిష్కరించి ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి తాను చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. తనను మరోసారి ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు అన్ని వర్గాల ప్రజల మద్దతు ఉందని, నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, సికింద్రాబాద్ కార్పొరేటర్లు శైలజ, హేమ, సునీత, ప్రసన్న లక్ష్మిలతో పాటు పద్మారావుగౌడ్ తనయులుకిశోర్‌గౌడ్, కిరణ్‌గౌడ్, రామేశ్వర్ గౌడ్, త్రినేత్ర గౌడ్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



సిరిపురి కాలనీలో పద్మారావుకు హారతి పడుతున్న మహిళలు

## మాగంటికి అండగా జన బలం

ఎర్రగడ్డ, నవంబర్ 6: సుస్థిర పరిపాలనతో పాటు పేద వర్గాలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్న కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే, జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ అన్నారు. సోమవారం ఆయన మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి బోరబండలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాగంటి మాట్లాడుతూ.. కాంగ్రెస్ చెప్పే మాయమాటలను నమ్మి మోసపోవద్దని.. పదేండ్లలో చేసిన అభివృద్ధిని చూసి నిర్ణయం తీసుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో డివిజన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. ప్రచారంలో అన్ని వర్గాల ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించడం విశేషం. ప్రచారంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, విజయకుమార్, కోఆర్డినేటర్ విజయసింహ, ఇన్‌చార్జి సిరాజ్, లక్ష్మణ్‌గౌడ్, మధుసూదన్, ఆనంద్, జైభీమ్ యాదగిరి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన టీడీపీ మాజీ ఫ్లోర్ లీడర్ చిత్తలూరి వెంకటేశ్వర్లు, ఆయన అనుచరులు

## బీఆర్ఎస్‌లో చేరిన చిత్తలూరి వెంకటేశ్వర్లు

ఎల్బీనగర్, నవంబర్ 6 : టీడీపీ మాజీ ఫ్లోర్ లీడర్, మాజీ కౌన్సిలర్ చిత్తలూరి వెంకటేశ్వర్లు తన అనుచరులతో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సమక్షంలో సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ...బీఆర్ఎస్ గెలుపునకు సైనికుడిలా పని చేయాలని సూచించారు.